# కలెక్టర్ దివాకర టి.ఎస్.ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

- పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అందజేసిన ఎమ్మెల్యే
- వైరా నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ తో ఎమ్మెల్యే చర్చలు



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వైరా నియోజకవర్గాన్ని

మిగతా 2 లో...




జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

బుధవారం | 2 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 7




# కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి

- కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తో మంత్రి తుమ్మల భేటీ
- డిల్లీలో కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రామ్మోహన్ కు రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేసిన మంత్రి తుమ్మల

**సత్తుపల్లి సెప్టెంబర్01(ప్రజా జ్యోతి)** భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఎయిర్ పోర్ట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం నాడు డిల్లీలో రామ్మోహన్ నాయుడు ను ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మల మర్యాద పూర్వకంగా కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు.కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు బులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.ఫీజుబులిటీ సర్వే లో ప్రతిపాదిత స్థలం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలం రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2 లో...

# వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఖమ్మం నగరంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేక దృష్టి సారించారు. మున్నేరు నదిలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా అనువైన చెరువులను మంగళవారం పరిశీలించారు.పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులు, సంభాద్రి ఉత్సవ కమిటీ తో కలిసి నిమజ్జనానికి అనువైన చెరువులను సందర్శించి, అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అందులో భాగంగా ఖమ్మం అర్బన్ మండలంలోని దంసలాపురం గ్రామపంచాయతీ లోని కొత్తూరు చెరువు సందర్శించి పరిశీలించారు.గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.నిమజ్జన ప్రాంతాల్లో విగ్రహాల తరలింపు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, భక్తుల భద్రత తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా,భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగేలా

మిగతా 2 లో...

# రైతులను నమ్మకుండా డిక్లరేషన్లు,బాండ్ పేపర్లు ఎందుకు

- వైరా మాజీ ఎమ్మెల్యే డా. బాణోత్ చంద్రావతి



**కొణిజర్ల ప్రజాజ్యోతి** సన్నవడ్లకు క్వింటాకు రూ. 500బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు డిక్లరేషన్లు,బాండ్ పేపర్లు, కొత్త నిబంధనలతో రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని వైరా మాజీ ఎమ్మెల్యే డా. బాణోత్ చంద్రావతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి అర్హత నిర్ధారించాలని ఆమె సూచించారు.రైతుల సమస్యలపై ఆమె పలు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. బోనస్ పొడిగింపు: సెప్టెంబర్ 10 కటాఫ్ తేదీని పొడిగించి, ఒక్క అర్హత ఉన్న రైతు కూడా బోనస్ నష్టపోకుండా చూడాలి. మొక్కజొన్న బకాయిలు: మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి బస్తాకు ఇస్తామని ప్రకటించిన రూ. 23 పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి. పత్తి కొనుగోలు

మిగతా 2 లో...

# డ్రైనేజీలపై దుకాణాల దందా.. ఇక కుదరదు!

- ఆక్రమణదారులకు నోటీసులు
- పోలీసుల సహాయంతో తొలగింపునకు ఆర్ అండ్ బీ సిద్ధం



**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 01 ప్రజా జ్యోతి** కూసుమంచి మండల కేంద్రంలో డ్రైనేజీలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి కిరాయిలకు ఇస్తున్న వ్యవహారంపై అధికారులు కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు. సోమవారం కూసుమంచి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన పలువురు వార్డు సభ్యులు ఈ సమస్యపై ప్రజావాణి కార్యక్రమంలో

మిగతా 2 లో...

## ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో అందరితో సమానంగా గౌరవించాలి

- స్వయం ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నాలు చేయాలని,అందుకు అవసరమైన సహకారం అందేలా ప్రయత్నం చేయాలి
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్స్ తో సమావేశం నిర్వహించారు. అయితే శుభకార్యాలు,వివాహాలు, ఇతర కార్యక్రమాలకు వెళ్లి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం,బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.ట్రాన్స్‌జెండర్స్ పై ఉన్న వివక్షను తొలగించి సమాజంలో సొంతంగా బతికేలా జీవనోపాధి కోసం పోలీస్ అధికారులు ప్రయత్నం చేస్తామనడం ఒక సానుకూల పరిణామం అని పలువురు ట్రాన్స్‌జెండర్స్ హర్షం వ్యక్తం చేశారు.

## నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణం చేసిన పవన్ కళ్యాణ్ అభిమాని ప్రశాంత్

- నూతన గృహాన్ని ప్రారంభించిన ఎస్సై జగదీష్



**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి సెప్టెంబర్ 01** తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన గుంజ ఉపేందర్ అను వ్యక్తి ఇటీవ ల దురదృష్టవశాతు పాము కాటుతో మరణించాడు మృతుడికి తల్లి భార్య ఇద్ద రు పిల్లలు ఉన్నారు కనీసం నిల్వనిడ లేక అల్లాడిపోతూ వర్షానికి తడుస్తూ ఎం డకి ఎండుతూ కూలిపని చేసుకుంటూ జీవితం కొనసాగిస్తున్న క్రమంలో ఇంటి కి పెద్దదిక్కుగా ఉన్న ఉపేందర్ మరణించడంతో కుటుంబం చిన్నాభిన్నం అయింది గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న కురవి గ్రామానికి చెందిన యువకుడు సేవకుడు ఇంస్టాగ్రామ్, యూట్యూబ్, ఇంఫ్లెన్సర్ గంగరబోయిన రఘు నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి అన్నితానై కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సినీ నటు డు పవన్ కళ్యాణ్ గారి జన్మదిన సందర్భంగా తన అభిమాని దాత ప్రశాంత్ ద్వారా వారికి ఇల్లు కట్టించి ఈరోజు తిరుమలాయపాలెం సబ్ ఇన్స్పెక్టర్ కూచిపూడి జగదీష్ చేతుల మీదుగా నూతన గృహం ప్రారంభించడం జరిగింది నెలకు సరిపడా బియ్యం, సరుకులు అంచింది మానవత్వం చాటుకున్నారు అలాగే సుమారు యాభై మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో చింటు, ప్రసాద్, పవన్, నిఖిల్ నవీన్ బోస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి...)

తరపున ప్రతిపాదన చేశామని అక్కడ ఫీజుబులిటీ సర్వే నివేదిక సిద్ధమైందని, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు ఈ నెల 7 తేదీన ప్రతినిధుల బృందాన్ని కొత్తగూడెం పంపిస్తామని హామీ ఇచ్చారు రామ్మోహన్ నాయుడు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్య గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు. జాతికి వెలుగులు అందించే సింగరేణి గనులు,హెవీ వాటర్ ప్లాంట్ ,ఐటీసీ బీ.పీ.ఎల్ సంస్థలతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అటవీ ప్రాంతంతో ఎకో టూరిజం కు కేరాఫ్ గా నిలిచింది.దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెం లో ఏర్పాటు చేశాం.గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామికంగా విద్యా పరంగా టూరిజం పరంగా జిల్లా ఎంతో పురోగతి చెందే అవకాశం ఉందని, దేశ విదేశాల నుంచి భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని రామ్మోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల సవివరంగా తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చేపట్టాల్సిన పనులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. తెలుగు బిడ్డెన రామ్మోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కల సాకారం కానుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# డ్రైనేజీలపై దుకాణాల దందా.. ఇక కుదరదు!



(మొదటి పేజీ తరువాయి...)

వినతిపత్రం సమర్పించారు.డ్రైనేజీలను ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేయడంతో మురుగునీరు సక్రమంగా వెళ్లకపోవడంతోపాటు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతోందని వార్డు సభ్యులు వినతిపత్రంలో పేర్కొన్నారు. దుకాణాల ముందు ఆక్రమణల కారణంగా వాహనాలు రోడ్డుపైనే నిలిపే పరిస్థితి ఏర్పడుతోందని, దీంతో రహదారి ఇరుకుగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రభుత్వానికి చెందిన డ్రైనేజీ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి, వాటిని దుకాణాలుగా మార్చి కిరాయిలకు ఇవ్వడంపై కఠిన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు కోరారు.

### రెండు, మూడు రోజుల్లో నోటీసులు

వార్డు సభ్యుల ఫిర్యాదుపై ఆర్ అండ్ బీ అధికారులు స్పందిస్తూ డ్రైనేజీలను ఆక్రమించిన వారిని గుర్తించి పూర్తి జాబితాను సిద్ధం చేస్తామని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. సిద్ధం చేసిన జాబితాను తహసీల్దార్, పోలీస్, ఎంపీడీవో అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

### ఒక్క తేదీ ఫిక్స్ చేసి.. ఆక్రమణలు తొలగింపు

నోటీసులు జారీ చేసిన అనంతరం అందరికీ ఒక గడువు తేదీని నిర్ణయించి, ఆ తర్వాత పోలీసుల సహాయంతో డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని ఆర్ అండ్ బీ అధికారులు వెల్లడించారు.ఇన్నాళ్లుగా డ్రైనేజీలను ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేయడంతో ఆక్రమణదారుల్లో ఆందోళన మొదలైంది. డ్రైనేజీ ఆక్రమణలతో మురుగునీటి సమస్యతోపాటు ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఇకనైనా మాటలకే పరిమితం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## రైతులను నమ్మకుండా డిక్లరేషన్లు,బాండ్ పేపర్లు ఎందుకు

(మొదటి పేజీ తరువాయి...)

పరిమితి పెంపు: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న 8 క్వింటాళ్ల కటాఫ్ పరిమితిని 12 క్వింటాళ్లకు పెంచి రైతులను ఆదుకోవాలి.ఈ సందర్భంగా ఆమె స్థానిక రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించి,సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు జెర్రుల వెంకన్న, నుండావత్ కృష్ణ, అజ్మీరా భాషా,వడతియా అంజని కుమార్,వడతియా హరిసింగ్, తేజావత్ వీరన్న,వడతియా హనుమా, వాంకడోత్ కృష్ణ, బుక్యా రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్

(మొదటి పేజీ తరువాయి...)

పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, భానుప్రకాష్, సంభ్రాద్రి ఉత్సవ కమిటీ వినోద్ లాహుటి, విద్యాసాగర్ శ్రీహరి, ప్రసన్నకృష్ణ, యుగేందర్ శర్మ, సురేష్ శర్మ పాల్గొన్నారు.

## కలెక్టర్ దివాకర టి.ఎస్.ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

(మొదటి పేజీ తరువాయి...)

అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ను కోరారు.ఖమ్మం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ ను దివాకర టి.ఎస్ ను వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు.అభివృద్ధి పనులు,రైతుల సమస్యలు,సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను పరిశీలించి,అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల ప్రజాపాలన అద్భుతం

- అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళల సాగు తోంది
- టిఆర్ఎస్ నేతల ఆరోపణలు అర్ధర హితం
- నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్

**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 01 ప్రజా జ్యోతి** దొరల నియంతృత్వ ప్రజా వ్యతిరేక పాలనను అంతం చేసి ఇందిరమ్మ రాజ్యంలోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారధ్యంలో ప్రజా పాలన వచ్చి వెయ్యి రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్ ప్రకటనలో మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు దళిత ముఖ్యమంత్రి, 3ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి అంటూ మాయ మాటలు గాడితో పది సంవత్సరాలు పాటు కుటుంబ పాలన సాగించి రాష్ట్రాన్ని దోచుకుని దాచుకొని రాష్ట్రాన్నిఅప్పుల కుప్పగా చేసిన ఘన చరిత్ర కేసీఆర్ కుటుంబానదిని తీవ్రంగా విమర్శించారు. ఈ నేపద్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు 25 లక్షల రైతు కుటుంబాలకు రెండు లక్షల రుణమాఫీ, 12 వేల రైతు



భరోసా, రైతులకు ఉచిత కరెంటు తో పాటు వరి ధాన్యంసన్నాలుకు 500 బోనస్, మహిళ సోదరీమణులకు ఉచిత బస్సు సౌకర్యం, 15 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు,1 కోటి కుటుంబాలకు సన్నబియ్యం, 55 లక్షల కుటుంబాలుకు 200 యూనిట్లు ఉచిత కరెంటు, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, ప్రతి నియోజకవర్గానికి 200 కోట్లతో పేద విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఏర్పాటు, 72,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు, 500 కే గ్యాస్ సిలిండర్, కొత్తగా రెండున్నర లక్షల వితంతు ఒంటరి మహిళ దివ్యాంగులకు ఆసరా పెన్షన్స్ మంజూరి, ఇలా దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రం అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమని కొనియాడారు ప్రజా పాలన ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి, మంత్రులు,ఎమ్మెల్యేలు సాగిస్తున్న సుపరిపాలన చూసి ఓర్వలేని బిఆర్ఎస్, బిజెపి, ప్రతిపక్షాలు సూర్యుడిపై ఉమ్మి వేసినట్లుగా ఆరోపణలు చేస్తున్నారని వీరి ఆరోపణలు గాలిలోనే కలిసిపోతాయని ప్రజలు వీరిని నమ్మరని తిరిగి మళ్లీ కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యాన్నే ప్రజలు ఎన్నుకుంటారని ఆయన జోష్యం చెప్పారు.

# సింగరేణి మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**కారేపల్లి, సెప్టెంబర్ 01, ప్రజా జ్యోతి:** జిల్లా కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు మంగళవారం సింగరేణి మండల కేంద్రం కారేపల్లి లో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీపై ఉత్తరా ఖండ్లో తప్పుడు ఎఫ్ఐఆర్ చేసినందుకు నిరసన తెలుపుతూ సింగరేణి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ మీద పెట్టినటువంటి కేసులన్నీ విత్ డ్రా చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని




డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థను బస్టూ పట్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచే విధంగా, విద్యార్థులందరీ భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటున్నా రాహుల్ గాంధీపై ఆక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారన్నారు. విద్యార్థులను, రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం మనుగడ కొనసాగదని వారు ఈసందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూరీ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బానోతు రామ్మూర్తి నాయక్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్ , సర్పంచులు బానో తు హీరా లాల్ ,దండు ప్రవీణ్ ,నాయకులు అడ్డగోడ ఐలయ్య, ఇమ్మడి తిరుపతి రావు, పెద్ద బోయిన ఉమా శంకర్, సురపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఖమ్మం జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు సురేంద్రమణియర్, అడప పుల్లారావు, కడియాల సుధాకర్ ,సంతోష్,ఎండి అనీఫ్, దారావత్ వినోద్, బోళ్ల రమేష్ ,షేక్ షంషుద్దీన్, షేక్ షఫీ ,ఆదేళ్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య సోసైటీ నుంచి ముగ్గురు సస్పెండ్

- ఐదేళ్ల పాటు సంఘం నుంచి తొలిగింపు
- చెరువు ను అప్రతిష్టపాలు చేసేందుకు అసత్య ప్రచారం
- మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఖాసిం



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి:**మండలం లోని చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నుంచి ముగ్గురు సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు యండీ.ఖాసిం తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకారం కు చెందిన సభ్యులు యడవల్లి సైదులు. తేజావత్ శ్రీను, కోట్యా నాయక్ లు సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సంఘం కు నష్టం కలిగించే విధంగా చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇద్దరు పై స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు కూడ నమోదైందన్నారు. నోటీసులు ఇచ్చినా వారిలో మార్పు రాలేదన్నారు. సంఘం అత్యవసర సమావేశంలో ముగ్గురు ను సంఘం నుంచి ఐదేళ్ల పాటు తొలిగించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో చెరువులో విషపూరిత రసాయనాలు కలుపుతున్నామని వస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. కొంత మంది కావాలనే చెరువు ను అప్రతిష్టపాలు చేయాలనే ఆసత్య ఆరోపణలు చేస్తున్నారని,ఆరోపించారు. చెరువు లో గత ఏడాది వర్షాల సమయంలో చేపలు సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆక్వా కల్చర్ అధికారుల అనుమతి తో మందు ను చల్లినట్లు తెలిపారు. ఆ మందు వలన ఎవరికి నష్టం లేదన్నారు. దానిని కొంత మంది ఇప్పుడు వీడియో వైరల్ చేసి స్వార్ధ ప్రయోజనం పొందుతున్నారని ఆరోపించారు. చెరువు పై ఆధారపడి 830 మంది సభ్యులు ఉన్నారని ఇలాంటి తప్పుడు ప్రచారం వలన వారి జీవన భృతి ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సోసైటీ ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, డైరెక్టర్లు బోయిన బలరాం, బాలబోయిన శేషయ్య, కాళంగి తిరపయ్యలు ఉన్నారు.

## పిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ని అమలు చేయాలి



**కారేపల్లి, సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి:** సిపిస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓ పి ఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సింగరేణి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బందితో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెన్షన్ విద్రోహ దినం పాటిస్తూ ఉపాధ్యాయులు టీచింగ్ నాట్ టీచింగ్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విద్యాసంస్థల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆఫీస్ సిబ్బంది,టీచింగ్, నాన్ టీచింగ్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ మట్టా



**సత్తుపల్లి సెప్టెంబర్01(ప్రజా జ్యోతి)**పట్టణంలోని పైయిళ్ళ సాయి శ్రీనివాస్, గంగ దంపతుల కుమార్తె హిమశ్రీ, నవీన్ కుమార్‌ల వివాహ రిసెప్షన్ కార్యక్రమం పట్టణంలోని సిద్ధారం రోడ్డు లో గల లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరై నూతన వధూవరులు హిమశ్రీ,నవీన్ కుమార్‌లను ఆశీర్వదించి, వారి జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## హెల్మెంట్, నంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్

- తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ



**తల్లాడ ప్రజా జ్యోతి** ద్విచక్ర వాహనాలకు సరియైన నంబర్ ప్లేట్, హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. తల్లాడ లో మంగళవారం సరైన నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలు పాల్పడి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ సారంగపాణి పర్యవేక్షణలో ముమ్మర తనిఖీ చెప్పటారు. సరైన నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి, సరైన నెంబర్ ప్లేట్లు తెచ్చుకొని అమర్చిన వాహనాలకు వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యంగా రోడ్లపై వాహనాలు నిలపడం ద్వారానే జరుగుతున్నాయని,అదేవిదంగా మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, రోడ్లపై తిరిగే వాహనాలకు తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. పెండింగ్ ఛానళ్లు చెల్లించాలని,రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న ట్రాఫిక్ నిబంధనలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ సామాగ్రి పంపిణీ




**సత్తుపల్లి సెప్టెంబర్1(ప్రజా జ్యోతి )**పట్టణంలోని బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్,బ్యాగులు, యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పాల్గొని విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందించడం అభినందనీయమని, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తు కోసం చక్కని ప్రణాళిక ఏర్పాటు చేసుకొని చదవాలని, మంచి ఉద్యోగం పొందాలని దాని ద్వారా తల్లిదండ్రులకు, అధ్యాపకులకు సమాజానికి మంచి పేరు తీసుకురావచ్చు అని చదువుపై ఉన్న విలువలను విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై ఉద్యమిస్తాం

- రాజ్యాంగ స్ఫూర్తికి అంత్యంత ప్రమాదకరం మోడీ
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 01 ప్రజా జ్యోతి** కూసుమంచి:జాతీయ నూతన విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వం డిమాండ్ చేశారు.స్థానిక కూసుమంచి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ మండల మహాసభ శ్యామ్ అధ్యక్షతననా జరిగింది ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నఇటికాల రామకృష్ణ నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూనివర్శిటిలను మూడు, నాలుగు. రకాలుగా విభజన చేసి విద్యను కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తుందని వారు అన్నారు. ఈ విధానాలు ప్రభుత్వం విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని వారు ఆరోపించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న వారినే యూనివర్శిటీలలో నియమాకాలు చేస్తుందని అన్నారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. నూతన విద్యావిధానం, విశ్వవిద్యాలయాల ఫండ్ కట్స్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్శిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై ఉద్యమించాలని ఆయన కోరారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపరచకుండా నూతన జాతీయ విద్యా విధానంలో పేదవారికి ఉచిత విద్యా లేనట్టేనని అయన పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలలో ప్రజాస్వామ్యం, సెక్యులర్ పదాలను, డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో బ్రిటిష్ ముస్కర్లకు తోత్తగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, హెడ్వార్గ్, వీర సావర్కర్ మొదలగు వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రను, తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బిజెపి ముందుందని అన్నారు. విభిన్న జాతులు కలిగిన వారు భారతదేశంలో ఉన్నారని, భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో ఒక కులాన్ని ఒక మతాన్ని ప్రోత్సహించే బిజెపి భారతదేశ చరిత్రను వక్రీకరిస్తున్నది అయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రనాయకులు గుండెపొంగు మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు బుర మనోజ్. మండల నాయకులు శ్యామ్, వినయ్, జ్ఞానేశ్వర్ రావు, జిల్లా నితిన్, జిల్లా వీరబాబు, యశ్మీన్, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఏఐఎస్ఎఫ్ మండల నూతన సమితి 21 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# ద్వివాంగుల సేవా స్ఫూర్తి.. పేద చిన్నారులు చదువుకు చేయూత



**కల్లూరు, సెప్టెంబర్ 01: ప్రజా జ్యోతి** తమ జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ పేద విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తూ ద్వివాంగులు సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. సత్తుపల్లి చెందిన స్వర్ణిక చారిటబుల్ ట్రస్ట్ ద్వివాంగుల సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం కల్లూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో నర్సరీ మరియు మూడవ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. కల్లూరు నివాసి చావా సత్యసాయి సహకారంతో సమకూర్చిన విద్యా సామాగ్రిని ఆశ్రమ సభ్యులు నాగోల్ అప్పారావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ద్వివాంగులు ఎదుర్కొంటున్న కష్టాలను పక్కనపెట్టి పేద పిల్లల చదువుకు సహకరిస్తున్న ద్వివాంగుల సేవాస్ఫూర్తి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం అని అభినందించారు. సమాజంలో తమ వంతు బాధ్యతగా భావించి చిన్నారులకు చేయూత అందించడం ఎంతో గొప్ప విషయం అని కొనియాడారు. ట్రస్టు నిర్వాహకులు వనపర్ల రవి మాట్లాడుతూ విద్యార్థులకు తమ వంతు సహకారం అందించడమే లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించేందుకు దాతలు ప్రజలు సహకరించి ద్వివాంగులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షబానా బేగం, రఘు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసిసి ఆదేశానుసారం టిపిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్,
- అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మంగళవారం లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పై దురుద్దేశపూర్వకంగా నమోదు చేసిన ఎఫ్ ఐ ఆర్ కు వ్యతిరేకంగా, ఉత్తరాఖండ్ లోని బీ జె పి కార్యకర్తలపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల ఆధ్వర్యంలో శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, ఏ ఐ సి సి సేవాదళ్ కో – ఆర్డినేటర్ చోటా బాబా, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వేజండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్ పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, విప్లవ కుమార్, మాజీ కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, శ్రేణులతో కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్ నుండి జెడ్ పి సెంటర్ నందు గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించనైనది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు మాట్లాడుతూ ఏ ఐ సి సి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే హల్ద్వానీలో ర్యాలీ వేదిక వద్ద బీజేపీ ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు జరిపిన అత్యంత హేయమైన, కులతత్వ శుద్ధీకరణ ఆచారం కు కొనసాగింపుగా, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఒక పత్రికా సమావేశంలో, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మరియు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ దృఢవైఖరిని తీసుకున్నారని, రాజ్యాంగ విలువలను తీవ్రంగా అవమానించిన నాయకులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా బీజేపీ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేస్తున్న ఉత్తరాఖండ్ పోలీసులు హల్ద్వానీ సిటీ కొత్వాలి పోలీసు స్టేషన్ లో రాహుల్ గాంధీపైదిగ్భ్రాంతికరంగా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారని, కుల ఆధారిత వివక్షకు, దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం చేసిన వారిని అణచివేయడానికి ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి శక్తిని ప్రయోగిస్తామని నిరూపించారని, ఈ కక్ష పూరిత రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తూ, ఉత్తరాఖండ్ లోని దోషులైన బీజేపీ కార్యకర్తలపై తక్షణ న్యాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో విజ్ఞత గల ప్రజలు బిజెపి కి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. అదే విధంగా బీజేపీ వేదింపులకు భారత జాతీయ కాంగ్రెస్ భయపడదని, సామాజిక న్యాయం, రాజ్యాంగ సమానత్వం మరియు ప్రతి పౌరుని గౌరవం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు తూములూరి లక్ష్మీనరసింహా రావు, కిలారు అనిల్ కుమార్, బండి మాధవరావు, బచ్చలకూర నాగ రాజు, సహేలా జావేద్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్, దామా స్వరూప, మూడుముంతల గంగరాజు యాదవ్, ముక్రం అలీ ఖాన్, శంకర్ నాయక్, పాటి నర్సయ్య, యాసబోయిన శ్రీశైలం, శ్రీలత, బ్రహ్మారెడ్డి, రంగా జనార్ధన్, కిలారు వెంకట రమణ, వేల్పుల మురళి, గజ్జి సూర్యనారాయణ, ఏలూరి రవికుమార్, కోసూరి ప్రసాద్, నరాల నరేష్, బాణాల లక్ష్మణ్, గుడవర్తి శ్రీనివాస్, బూర్లె లక్ష్మీ నారాయణ, ఖాజా మురళి, గడ్డం వెంకటయ్య, మహమూద్, జహీర్, ఫరీద్ ఖాద్రి, రజీ భాయ్, వెంకట్రావు నాయక్, బండి నాగేశ్వరరావు, నల్లమోతు లక్ష్మయ్య, నల్లమోతు రవి, బడే మియా, జాని, బలుసు లక్ష్మీ, జొన్నలగడ్డ అరుణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ పై ఎఫ్ఐఆర్ ను ఉపసంహరించుకోవాలి

- శుద్ధికరణ పేరుతో ఖర్గేను అవమానించడం హేయమైన చర్య
- రాష్ట్ర మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి
- ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై అక్రమంగా పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ..ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో వరంగల్ క్రాస్ రోడ్ నుంచి మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ...: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా వేదిక ప్రాంతాన్ని "శుద్ధి" చేస్తున్నామనే నెపంతో, దళితుడైన ఆయనను తీవ్రంగా అవమానించిన బీజేపీ నేతలపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, దళితులను అవమానించడం వారి అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో.. ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, సీనియర్ నాయకులు కందుకూరి వెంకటనారాయణ, కళ్లెం వెంకటరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, డివిజన్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాల సమస్యల పరిశీలనకు సీపీఎం బృందం సందర్శన

**ముదిగొండ సెప్టెంబర్ 01(ప్రజా జ్యోతి )**ముదిగొండ గ్రామంలోని మిట్టగూడెం ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న పలు తీవ్రమైన సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సీపీఎం పార్టీ ప్రతినిధుల బృందం పాఠశాలను సందర్శించింది. పాఠశాలలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులతో బృందం సభ్యులు సమావేశమై, స్కూల్ లో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి సుదీర్ఘంగా చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో పాఠశాలలో అత్యంత దయనీయమైన పరిస్థితులు ఉన్నట్లు బృందం గుర్తించింది. ముఖ్యంగా విద్యార్థులకు తాగునీటి సమస్య ప్రధానంగా మారింది. దీనితో పాటు విద్యార్థినుల బాత్రూమ్ లలో నీటి సౌకర్యం లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బృందం దృష్టికి తెచ్చారు. అంతేకాకుండా, ఇటీవల జరిగిన రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పాఠశాల వంటగది మరియు ప్రహరీ గోడను తొలగించడం జరిగింది. దీనివల్ల విద్యార్థులకు సరైన రక్షణ లేకుండా పోయింది. ప్రహరీ గోడ లేకపోవడంతో బయటి వ్యక్తులు, పశువులు పాఠశాల ఆవరణలోకి వస్తుండటంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనల మధ్య గడపాల్సి వస్తోంది. అలాగే వంటగది లేకపోవడంతో మధ్యాహ్న భోజనం తయారీకి సైతం తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ సందర్భంగా సీపీఎం ప్రతినిధులు మాట్లాడుతూ.. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే వంటగదిని, ప్రహరీ గోడను కూల్చివేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, బాలికల బాత్రూమ్ లలో నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే యుద్ధప్రాతిపదికన కొత్త వంటగదిని, రక్షణ గోడను నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యలపై విద్యాశాఖ అధికారులకు మరియు జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పిస్తామని, ప్రభుత్వం వెంటనే స్పందించి మిట్టగూడెం పాఠశాల సమస్యలను పరిష్కరించకుంటే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సీపీఎం బృందం హెచ్చరించింది.




# జిల్లాలో తపాలా శాఖ ఆధ్వర్యంలో 16 కేంద్రాలలో ఆధార్ సేవలు

- ఈ ఏడాది 5 లక్షల ఖాతాల నమోదు లక్ష్యం తో ముందుకు.
- తపాలా శాఖ సూపరిండెంట్ వి.వీరభద్రస్వామి



**నేలకొండపల్లి, సెప్టెంబరు 1ప్రజా జ్యోతి :**జిల్లాలో తపాలా శాఖ ఆధ్వర్యంలో 16 కేంద్రాలలో ఆధార్ సేవలు అందిస్తున్నట్లు శాఖ జిల్లా సూపరిండెంట్ వి.వీరభద్రస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉప తపాలా కార్యాలయంను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... జిల్లాలో 818 కార్యాలయాల ద్వారా వినియోగదారులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 లక్షల మంది ఖాతాదారులు ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది మార్చి నాటికి : మరో 5 లక్షల మంది ఖాతాదారులను చేర్పించే విధంగా కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. పోస్టాఫీస్ ఆధార్ కేంద్రాలలో నాలుగు రకాల సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వాటిలో కొత్తగా నమోదు చేసే ప్రక్రియ ను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 1.25 లక్షల మంది నూతనంగా ఖాతాలు ప్రారంభించినట్లు తెలిపారు. తపాలా శాఖ లో అనేక భీమా సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. ప్రజ లు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించినున్నట్లు తెలిపారు. వివిధ సేవలు, పొదుపు పథకాలు, బీమా సేవలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సేవల పై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, ఇన్సెపెక్టర్ శ్రీనివాస్, ఎస్పీయం కృష్ణయ్య, పాల్గొన్నారు.

# శిరీషను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- దారావత్ భద్రునాయక్



**కారేపల్లి, సెప్టెంబర్ 01, ప్రజా జ్యోతి** :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండలానికి చెందిన ఆదివాసి యువతి ఊకే శిరీషపై జరిగిన అత్యాచారం, అనంతరం జరిగిన హత్య రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని భద్రునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, సింగరేణి మండల పోలంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ధారావత్ బద్రునాయక్ మంగళవారం సింగరేణి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసి సమాజానికి చెందిన ఒక అమాయక యువతి ప్రాణాలు కోల్పోయిన తర్వాత కూడా, ఘటనకు సంబంధించిన పూర్తి నిజాలు వెలుగులోకి రాకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తుంది.అందువల్ల ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో, జ్యుడిషియల్ విచారణ జరిపి అసలు వాస్తవాలను వెలుగులోకి తేవాలి,దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వేధింపులు పెరుగుతుండటం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉన్నప్పటికీ, దళిత, గిరిజన మహిళల ప్రాణాలు, గౌరవం, భద్రతకు పూర్తి స్థాయిలో రక్షణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.నేరస్థులను కాపాడే ఏ రాజకీయ నాయకుడైనా, ప్రభావశీలుడైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని స్పష్టం చేశారు. ఊకే శిరీషపై దారుణానికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, వేగవంతమైన విచారణ జరిపి చట్టప్రకారం అత్యంత కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.

## తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

- గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ
- తాగు నీటి కోసం ఏ కుటుంబం ఇబ్బందులు పడకూడదు
- గ్రేస్ సొసైటీ సంస్థ ప్రతినిధి ఎర్నెస్ట్ పాల్
- గ్రేస్ సంస్థ ఆధ్వర్యంలో బోనకల్ లో రెండు చేతిపంపులు ప్రారంభం



**బోనకల్, సెప్టెంబర్ 01(ప్రజా జ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బోనకల్ గ్రామంలో మంగళవారం రెండు చేతిపంపులను ఏర్పాటు చేసి ప్రారంభించారు. తాగునీటి అవసరాలను గుర్తించి ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గ్రామస్థులు అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ... గ్రామంలో మంచినీటి ఎద్దడి తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బోర్లు, చేతిపంపులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలకు సేవా సంస్థలు అండగా నిలవడం అభినందనీయమన్నారు.గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో తాగునీటి అవసరాలను గుర్తించి బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన నీటి సౌకర్యాన్ని అందించేందుకు కార్యక్రమాలు కొనసాగిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రజల ప్రాథమిక అవసరాల్లో ఒకటైన తాగునీటి సమస్య పరిష్కారానికి సేవా సంస్థలు ముందుకు రావడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి ఎర్నెస్ట్ పాల్ మాట్లాడుతూ.. తాగునీరు ప్రతి మనిషి ప్రాథమిక హక్కు అని, నీటి కోసం ఏ కుటుంబం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తమ సంస్థ సేవా కార్యక్రమాలను బోనకల్ గ్రామపంచాయతీ సహకారంతో చేపడుతోందని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రజల అవసరాలకు స్పందించి సేవ చేయడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని, సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ, గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు జాను, ఎస్. నరేష్, పాస్టర్ మోహన్, బోనకల్ సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పెద్దలు గాలి దుర్గారావు, నందమూరి సత్యనారాయణ, యార్లగడ్డ రమేష్, గుగులోతు నాగేశ్వరరావు, గంగుల పుల్లయ్య, బానోత్ రాజు నాయక్, గుగులోతు స్వామి, బాధావతు గాంగు, బానోతు మురళి, బుక్య శ్రీను, బోడ యోగి శ్రీనివాస్, గోపి, గ్రామపంచాయతీ పాలకవర్గం యార్లగడ్డ కుమారి, మరిధు శేషు, అంతోటి శ్రీను, అంతోటి సునీత, షేక్ మేరా సాహెబ్, జరుపల లావణ్య, తాళ్లూరి జ్యోతి, ఉప్పర శీను, షేక్ నౌషిన్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూరియా కోసం భరణిపాడు సొసైటీ ముందు రైతులు ధర్నా



**వేంసూరు సెప్టెంబర్ 1 ప్రజాజ్యోతి** మండల పరిధిలోని భరణిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) భవనం ఎదుట గ్రామ రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సొసైటీ పరిధిలో యూరియా పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని రైతులు ఆరోపించారు.యూరియా కోసం సొసైటీ వద్దకు వస్తున్న రైతులకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా పంపిణీకి సంబంధించిన ఫోన్ యాప్ సక్రమంగా పనిచేయకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని తెలిపారు. యాప్ పనిచేయకపోవడం వల్ల యూరియా పొందేందుకు నానా అవస్థలు పడుతున్నామని రైతులు పేర్కొన్నారు.యూరియా పంపిణీ ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని, కొంతమంది రైతులకు మాత్రమే యూరియా అందుతున్నట్లు పరిస్థితి కనిపిస్తోందని వారు ఆరోపించారు. సాగు సమయంలో యూరియా కొరత ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వం, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి యూరియా పంపిణీపై సమగ్రంగా పరిశీలన జరిపించాలని రైతులు డిమాండ్ చేశారు. యాప్ సమస్యలను వెంటనే పరిష్కరించి, సొసైటీ పరిధిలోని అర్హులైన రైతులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంచడంతో పాటు పంపిణీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి,గరిష్ఠ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్ డా.జి.వి.మహేష్ నాథ్ సూచించారు.జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో ఖమ్మం యూనిట్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను ముందుగానే గుర్తించి,సంబంధిత కక్షిదారులను లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి, వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మనస, ఖమ్మం యూనిట్‌కు చెందిన ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై అక్రమ కేసులు కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యే

- ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నిరసన



**ముదిగొండ సెప్టెంబర్ 1(ప్రజా జ్యోతి )**ముదిగొండ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై నరేంద్ర మోదీ ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులను నిరసిస్తూ మంగళవారం ముదిగొండ మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపూడి బుచ్చి రామయ్య, జిల్లా నాయకులు మల్లెల అజయ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీని చూసి ఓర్వలేకనే ప్రధాని మోదీ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతూ రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై ఈడీ, సీబీఐలతో అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూడటం బీజేపీ నియంతృత్వ వైఖరికి నిదర్శనమని, ఎన్ని కేసులు పెట్టినా కాంగ్రెస్ శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రాహుల్ గాంధీపై పెట్టిన తప్పుడు కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సరస్వతి మృతి పట్ల సండ్ర నివాళులు

- పొదిల దేవేంద్రనాథ్ కుటుంబాని కి పరామర్శ



**ముదిగొండ సెప్టెంబర్ 1(ప్రజా జ్యోతి )**మాజీ ఎమ్మెల్సీ సామినేని హిమవంతరావు సతీమణి సరస్వతి పరమ వధించడంతో విషయం తెలుసుకున్న మాజీ సత్తుపల్లి సీనియర్ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మంగళవారం ఉదయం మేడేపల్లి గ్రామాన్ని సందర్శించి ఆమె భౌతిక ఖాయం వద్ద పుష్ప గుచ్చం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రమేష్ నిపరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతులు తెలియజేస్తూ సరస్వతి కి సంతాపం ప్రకటించారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ స్థానిక సర్పంచ్ చెరుకుపల్లి జగన్ బీఆర్ఎస్ మండల నాయకులు పచ్చ సీతారామయ్య బీసీ సెల్ మాజీ మండల అధ్యక్షులు తోట ధర్మారావు బత్తుల వెంకట్రావు చెరుకుపల్లి బిక్షం మల్లేపల్లి శంకర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

**పొదిల రవికుమార్ కు పరామర్శ....**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పొదిల దేవేంద్రనాథ్ కుటుంబాన్ని ఈ సందర్భంగా తన స్వగ్రామైన ఖానాపురం గ్రామంలో ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రమటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు దేవేంద్రనాథ్ కుమారుడు రవి కుమారును పరామర్శించి మనోధైర్యంను ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ప్రముఖులు పాల్గొన్నారు.

## సామినేనీ సరస్వతి కి ఘన నివాళులు

- నివాళులర్పించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ముదిగొండ సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి )**ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామానికి చెందిన దివంగత మాజీ ఎమ్మెల్సీ సామినేని హిమవంతరావు సతీమణి సామినేని సరస్వతి మృతి పట్ల రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ,సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సంతాపం తెలిపారు.వారి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుచ్చయ్య చౌదరి,సామినేని వెంకటేశ్వరరావు, పసుపులేటి దేవేందర్, చిలకల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఎర్రచొక్కాలతో సందడి చేసిన ఎదులాపురం మున్సిపాలిటీ సీపీఐ నాయకులు



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ వద్ద సీపీఐ జాతీయ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "బదలావు జరూరి హై" మహా ధర్నాలో ఎదులాపురం మున్సిపాలిటీకి చెందిన సీపీఐ నాయకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎదులాపురం మున్సిపాలిటీ సీపీఐ నాయకులు ఎర్రచొక్కాలు ధరించి ధర్నాలో పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశంలో మార్పు అవసరాన్ని చాటిచెప్పే నినాదాలతో వారు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సీపీఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎదులాపురం మున్సిపాలిటీ నాయకులు తమ ఉనికిని చాటుకున్నారు. స్థానిక స్థాయి నుంచి దేశ రాజధాని వరకు పార్టీ ఉద్యమాల్లో భాగస్వామ్యం కావడం తమకు గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిపిఐ నాయకులు, మహిళా సమాఖ్య సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కామేపల్లి మండలం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏడవ మహాసభలు

- సి ఐ టి యు కామేపల్లి మండలం ఆధ్వర్యంలో భూక్య రమణ అధ్యక్షులు



**కామేపల్లి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 1** కామేపల్లి మండలం పరిధిలో కామేపల్లి మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏడవ మహాసభలు ముఖ్య రమణ అధ్యక్షతన నిర్వహించారు కార్మికులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని వారికి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని 60 సంవత్సరాలు దాటిన వాళ్ళకి 5000 పెన్షన్ ఇవ్వాలని లేబర్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరికి వర్తింపచేయాలని కార్మికులకు రక్త పరీక్ష నిలుపుదల చేయాలని లేబర్ ఇన్సూరెన్స్ లో 90 రోజుల ను తొలగించాలని డైరెక్ట్ కార్మికులను గుర్తించి కార్మికులకు రావలసిన బెనిఫిట్ లను లేబర్ చట్టం ద్వారా ఇవ్వాలని కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ ఇవ్వాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిఐ మండల కన్వీనర్ బాధావత్ శ్రీను రైతు సంఘం డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ కొత్తపల్లి ఉపేందర్ రామ్మూర్తి నాగేశ్వరరావు కోటేశ్వరరావు ఎస్.కె ఫరీద్ ఈ మహాసభలో బిల్డింగ్ వర్కర్స్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మాచారి మోదం శ్రీను ఈ రమ్య మరియు పండితాపురం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు భానోత్ శ్రీను ధరావత్ ఉపేందర్ బుక్కా రవి భాను వీరన్న మరియు కామేపల్లి మండలంలోని బిల్డింగ్ వర్కర్స్ సభ్యులు పాల్గొని సభను విజయవంతం చేయడం జరిగింది.

## మంచినీటి ట్యాంకు వద్ద గడ్డి మందు కొట్టిస్తున్న ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయె లుసి

**కామేపల్లి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 1** కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామపంచాయతీ నందు వాటర్ ట్యాంక్ చుట్టూ మరియు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మంచినీటి ట్యాంకుల వద్ద రోడ్లు పక్కన ఉన్న పిచ్చి మొక్కలకు గడ్డి మందు కొట్టిస్తున్న సర్పంచ్ జాటోత్ జాయె లుసి ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చర్ల సెక్రటరీ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది



# రాహుల్ గాంధీ పై ఎఫ్ ఐ ఆర్ ను ఉపసంహరించుకోవాలి

- శుద్దీకరణ పేరుతో కార్గేను అవమానించడం హేయమైన చర్య
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిరసన ర్యాలీ



**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 01 ప్రజా జ్యోతి** ఏఐసీసీ ఆదేశానుసారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు కాంగ్రెస్ అగ్రనేత, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు. బజ్జూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కూసుమంచి మండల కేంద్రం లో రాహుల్ గాంధీ పై మోదీ ప్రభుత్వం అక్రమంగా కేసు పెట్టడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి కూసుమంచి మండల కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉత్తారాఖండ్ లోని హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ ముగిసిన తర్వాత కొందరు 'శుద్ధీకరణ' నిర్వహించారని దీనిపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే ఆయనపై బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని ఆయన మండిపడ్డారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రశ్నించిన రాహుల్ గాంధీపై కేసు పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన అన్నారు. ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వం కుల వివక్షను నిర్మూలించేందుకు నిర్దిష్ట చర్యలేమి తీసుకుందని ఆయన ప్రశ్నించారు. హల్ద్వానీ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా, ప్రశ్నించిన నాయకుడిపై కక్ష పూరితంగానే కేసులు పెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేసారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా రాహుల్ గాంధీ పైన పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హాఫీజుద్దీన్, మండల మాజీ ఎంపీపీలు జూకురి గోపాలరావు, బానోత్ శ్రీనివాస్ నాయక్, మాజీ జడ్పిటిసి రామసహాయం బాలకృష్ణారెడ్డి, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురేష్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బానోత్ వినోద, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సరోజినీ, జిల్లా నాయకులు మాదాసు ఉపేందర్, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మీరా, కిరణ్, కేశవ రెడ్డి ,రమేష్ రెడ్డి, కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి మైపాల్, మల్లాయగూడెం సర్పంచ్ బాదావత్. నరేష్, సంధ్య తండ సర్పంచి బొంగ నాయక్ ,అగ్రహారం సర్పంచ్ మల్లెల స్వాతి ఉపేందర్, నేలపట్ల సర్పంచి నూకల శోభన్ బాబు, లింగారాం తండా సర్పంచి వడిత్య. పుష్ప రవి, చౌటపల్లి గ్రామ సర్పంచి మక్కా రామ కృష్ణ, తుర్కగూడెం గ్రామ సర్పంచి బుర్ర కృష్ణ, మల్లేపల్లి సర్పంచి మక్కల భవిత, పెరిక సింగారం సర్పంచ్ కందునూరి మంగమ్మ, పాలేరు సర్పంచ్ బానోత్ నాగేశ్వరరావు, గట్టు సింగారం సర్పంచ్ మేడేపల్లి విజయ, లోక్యతండ సర్పంచ్ వడిత్య. వెంకటేష్, కోక్య తండా సర్పంచ్ అల్లా వత్. వీరన్న, మునిగేపల్లి సర్పంచ్ స్రవంతి, వివిధ గ్రామాల వార్డ్ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి సోమయ్య దంపతులకు విదేశీ పర్యటన శుభాకాంక్షలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** విదేశీ పర్యటనకు బయలుదేరుతున్న మామిడి సోమయ్య,సతీమణి వరలక్ష్మి దంపతులకు ఖమ్మం జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్ ) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పర్యటన ఆనందదాయకంగా,ఆరోగ్యకరంగా సాగాలని, పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకుని సురక్షితంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843 యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, స్టేట్ కౌన్సిలర్ సభ్యులు నల్ల రాకేష్ రెడ్డి, నేషనల్ కౌన్సిలర్ సభ్యులు, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## పాలకులు పట్టించుకోరు మహాత్మాకు కార్మికుల మొర!

- పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ గాంధీ విగ్రహానికి మున్సిపల్ కార్మికుల వినతి




**కల్లూరు, సెప్టెంబర్ 01: ప్రజా జ్యోతి** పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కల్లూరు మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వినూత్న రీతిలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి కార్మికులు వినతి పత్రం సమర్పించారు. మహాత్మ మీరైనా కనికరించండి ప్రజాప్రతినిధులు, పాలకులు, అధికారులతో మాట్లాడి మా పెండింగ్ వేతనాలు ఇప్పించేలా చూడండి అంటూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నెలల తరబడి వేతనాలు పెండింగ్ లో ఉండటంతో కుటుంబాలను పోషించడం తీవ్ర ఇబ్బందిగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ ప్రభుత్వ అధికారులు వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు, మున్సిపల్ కార్మికుల జిల్లా ఉపాధ్యక్షుడు ఉడల కృష్ణమూర్తి, కార్యదర్శి వజేర్మియా, మణి రాజు, యశోద, కృష్ణవేణి, అంజలి, చింతపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పి ఆర్సి, సిపిఎస్ రద్దు పై ప్రభుత్వ పై పోరుబాట పట్టాం

- పి ఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు

**మధిర ప్రజా జ్యోతి** హైదరాబాద్ ఇందిరా పార్క్ మంగళ వారం నిర్వహించిన మహా ధర్నా కు పి ఆర్టియు మధిర ఎర్రుపాలెం మండల శాఖల ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్ళిన ఉపాధ్యాయులు.పి ఆర్సి ని వెంటనే విడుదల చేయాలని, సి పిఎస్ ను రద్దు చేసి ఓ పిఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యం ఎల్సి పింగిలి శ్రీపాల్ రెడ్డి నేతృత్వంలో మరియు పి ఆర్టియు రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మధిర ఎర్రుపాలెం మండల శాఖల ఆధ్వర్యంలోఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారని జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మ రెడ్డి తెలియజేశారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు మాట్లాడుతూ పిఆర్సి గడువు దాటి పోయి మూడు సంవత్సరాలు అయినప్పటికీ సిపిఎస్ రద్దు చేస్తామన్న ప్రభుత్వ హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడంలో కూడా ప్రభుత్వం సాచివేత ధోరణి అవలంబిస్తుందని ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ హామీ కూడా నెరవేర్చకపోవడంతో పి ఆర్టియు పోరుబాట పట్టిందని ప్రభుత్వం ఇప్పటికైనా మాట నిలుపుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ కొమ్ము శ్రీనివాసరావు, యస్ .సంగిరెడ్డి వి.నాగరాజు రాష్ట్ర బాద్యులు డి .వెంకటేశ్వరరావు మాజీ రాష్ట్ర బాధ్యులు షేక్ మదార్ మధిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలే సుధాకర్ ఎర్రుపాలెం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి .మదన్మోహన్ రెడ్డి, యం.బాబురావు సీనియర్ నాయకులు కొలగాని ప్రసాదరావు మధిర ఎర్రుపాలెం మండలాల బాధ్యులు యం డి జమీర్ కె రాఘవరావు, కె శాంత బాబు,తెల్ల మేకల శ్రీనివాసరావు నాగభూషణ్ రెడ్డి లూఖ్య రామారావు రెండు మండలాల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఆరు గ్యారెంటీ లే కాదు.. మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం

- బి ఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు మానుకుని వాస్తవాలు తెలుసుకోవాలి
- మధిర మండల కాంగ్రెస్ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్



**మధిర ప్రజా జ్యోతి** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మంగళ వారం మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ బి ఆర్ ఎస్ నాయకులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తోంది. ఆరు గ్యారెంటీల్లో లేని అనేక సంక్షేమ కార్యక్రమాలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రుణ మాఫీ వంటి హామీలను అమలు చేయడంతో పాటు, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమాలను కూడా ప్రభుత్వం చేపట్టిందన్నారు. మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని అన్నారు ఆరు గ్యారెంటీల్లో లేని సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను సైతం అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మహిళల సాధికారత, విద్య, వైద్యం, ఉద్యోగాలు మరియు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిసారించి ముందుకు సాగుతోందన్నారు.అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డిది కాదా?కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డిది కాదని అంటున్నారు..కేసీఆర్ 24 గంటలు ఫామ్‌హౌస్‌లో పడుకొని ఉండి రాజకీయాలకు దూరంగా ఉన్న సమయంలో.. ప్రజల్లో తిరుగుతూ, ప్రజా సమస్యలపై పోరాడిన రేవంత్ రెడ్డే నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు.కేసీఆర్ పాలనను ప్రశ్నించడానికి, ఆయన ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడానికి రేవంత్ రెడ్డికి పూర్తి రాజకీయ హక్కు ఉంది. స్థాయి గురించి మాట్లాడేవారు ముందు ఎవరు ప్రజల్లో ఉన్నారు? ఎవరు ప్రజల కోసం పోరాడారు? అనేది ఆలోచించాలి.ప్రోటోకాల్ గురించి బిఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందికేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన మనవడు హిమాన్షు ఏ హోదాలో భద్రాచలం సీతారామచంద్రస్వామివారి కల్యాణ వేడుకల్లో పట్టు వస్త్రాలు సమర్పించారు? దానికి కమల్ రాజ్ సమాధానం చెప్పాలని అన్నారు.ముందుగా బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీల్లో ఎన్నినెరవేర్చారో లింగాలకమల్‌రాజ్ ప్రజలకు సమాధానం చెప్పాలని, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయాలని హితవు పలికారు. దళితులకు మూడు ఎకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, లక్ష రూపాయల రుణమాఫీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇలాంటి బూటకపు హామీలు ఎన్నో ఇచ్చిన బిఆర్ఎస్ పార్టీ ఎన్ని అమలు చేశారో కమల్ రాజు చెప్పాలన్నారు.ప్రజలకు వాస్తవాలు తెలుసు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలు చూస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మధిర మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం, వైస్ చైర్మన్ కోన ధని కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణ గుప్తా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్ పాటి బండ్ల సత్యంబాబు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్‌రెడ్డి రామాలయం కమిటీ చైర్మన్ వంగవీటి రాజశేఖర్ కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన

- పెండింగ్ డీఏలు విడుదల చేయాలి – పీఆర్సీ ప్రకటించాలి
- టీజీ జేఏసీ, నాయకుల డిమాండ్



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీ జేఏసీ, నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఎర్రుపాలెం మండలంలోని అన్ని పాఠశాలల్లో, అలాగే ఎండీఓ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళ వారం ఉద్యోగులు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా టీఎస్ యుటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు, ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నంద్రు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులు, వారి కుటుంబాలు ఆర్థిక భద్రతపై ఆందోళన చెందుతున్నారని తెలిపారు.అదేవిధంగా ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే పీఆర్సీని ఏర్పాటు చేసి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెరుగైన ఫిట్‌మెంట్‌తో వేతనాలు అందిస్తామని ఇచ్చిన హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ఇకపై జాప్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోందని నాయకులు అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి, ఉద్యోగుల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.సీపీఎస్ రద్దు, పీఆర్సీ ఏర్పాటు, పెండింగ్ డీఏల విడుదల తదితర ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని, ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనకు ముగింపు పలకాలని టీజీ జేఏసీ, టీఎస్ యుటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ ఆఫీస్ సూపర్డెంట్ శ్రీనివాసరావు గారు ఎండిఓ ఆఫీస్ ఉద్యోగులు ఎమ్మార్వో ఉద్యోగులు టీఎస్ యుటిఎఫ్ నాయకులు టి రత్తమ్మ నీలం సైదారావు సతీష్ జీవన్ కాజా నాగేశ్వరరావు రవికుమార్ సత్యనారాయణ నాగరాజు పిడి సాంబశివ రెడ్డి ఎస్ వెంకమ్మ పుల్లయ్య రత్నకుమారి డి రమేష్ టి వెంకటకృష్ణ ఎం శ్రీనివాస్ పుల్లారావు వివిధ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ తోటను పరిశీలించిన ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి ఎం వి మధుసూదన్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఆయిల్ పామ్ పంట ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం కలిగినదని, కోతుల బెడద తక్కువగా ఉండే పంటగా కూడా ఇది ప్రసిద్ధి చెందిందని జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ అధికారి, ఎం . వి . మధుసూదన్ తెలిపారు. తల్లాడ మండలంలోని కొడవటిమెట్ట గ్రామములోని ఆయిల్ పామ్ తోటను ఉద్యాన అధికారి నగేష్‌తో కలసి సందర్శించారు. ఆయిల్ పామ్ పంటలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించి, ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయేతర పంటల్లో మంచి లాభాలు ఉన్న ఆయిల్ పామ్ తోట నాటుకోవడం మంచిదని, పామ్ ఆయిల్ సాగులో అంతర పంటగా వక్క,కోకో,మునగ, సుగంధ పంటలు వేసుకోని ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఆయిల్ పామ్ పంట ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం కలిగినదని, కోతుల బెడద తక్కువగా ఉండే పంటగా కూడా ఇది ప్రసిద్ధి చెందిందని చెప్పారు. ఈ పంటకు సరైన మార్కెట్ సౌకర్యం ఉండటంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆయిల్ పామ్ సాగు విధానాలు, మొక్కల నాటడం, నిర్వహణ మరియు రాయితీల వివరాలను రైతులకు వివరించారు.అనంతరం తల్లాడ లోని మిరప నర్సరీ లను తనిఖీ చేసి, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి జి. నగేష్, డ్రిప్ కంపెనీ ప్రతినిదులు, రైతులు పాల్గొన్నారు.

# వేంసూరు ఎస్సై ప్రదీప్ ని కలిసిన పలువురు నేతలు

- అభినందనలు తెలియజేసిన ప్రజా సంఘాలు , విలేకరులు





**వేంసూరు సెప్టెంబరు 1 ప్రజా జ్యోతి** ఇటీవల వేంసూరు ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టినటువంటి ప్రదీప్ ను అనేకులు కలిసి అభినందనలు తెలియజేశారు మరి ముఖ్యంగా కల్లూరుగూడెం సర్పంచ్ మరియు మర్లపాడు సర్పంచ్ మరియు మర్లపాడు కాంగ్రెస్ నాయకులు కల్లూరు గూడెం కాంగ్రెస్ నాయకులు కలవడం భరణిపాడు బి ఆర్ ఎస్ నాయకులు కలవడం జరిగింది.ప్రజాసంఘాలు అలాగే జర్నలిస్టు అనేకులు ఎస్ఐ ప్రదీప్ ని కలిసి అభినందనలు తెలియజేస్తూ వేంసూరు మండలాన్ని శాంతిభద్రతలో ఎటువంటి అగాధం కలగకుండా చూడాలని ఆయ న కోరారు ఎస్సై ప్రదీప్ మాట్లాడుతూ మండలాన్ని శాంతిభద్రత ఎల్లప్పుడూ ఉంచడానికి నేను పనిచేస్తానని మరి ముఖ్యంగా మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తన వంతు కర్తవ్యాన్ని పూర్తిగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు వేంసూరు మండలానికి రావడం తనకు కలిగిన అదృష్టమని ఆయన ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండలం రామన్న పాలెం గ్రామంలో మంగళ వారం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి పరమేశ్వరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రేషన్ కార్డులు పేద, అర్హులైన కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపా రు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.స్మార్ట్. రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వార్డ్ సభ్యులు మడుపల్లి ప్రసాద్ ( చక్రి ) జిపిఓ మల్లయ్య సెక్రెటరీ గోపీచంద్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి బొబ్బిళ్ళపాటి బాబురావు కొత్తపల్లి ప్రశాంత్ తలపు రెడ్డి బాలాజీ రెడ్డి ఐలూరి నాగిరెడ్డి బొబ్బిళ్ళపాటి నల్ల మోషే బలవంతపు కనక రత్నం సంగేపు యేసోబు గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.